సాక్షి ఖమ్మం

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



పోరాటయోధుడు.. శివాజీ

ఛత్రపతి శివాజీ పోరాటయోధుడని పలువురు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా జిల్లాలో ర్యాలీలు నిర్వహించారు. 9లో



బియ్యం ఇస్తారా.. ఇవ్వరా?

పోర్టబులిటీ విధానంతో ఇతర ప్రాంతాల వారు జిల్లాలో బియ్యం తీసుకుంటుండగా స్థానిక లబ్ధిదారులకు కొరత ఎదురవుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 21°

వాతావరణం

జిల్లాలో గురువారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. రాత్రి అయ్యేసరికి చలిగాలుల తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆరుతడి పంటలతో నికర ఆదాయం



పెసర పంటను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

రఘునాథపాలెం: రైతులు ఆరుతడి పంటలుగా పెసర తదితర పంటలు సాగు చేస్తే మిగతా వాటితో పోలిస్తే నికర ఆదాయం లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) ధనసరి పుల్లయ్య తెలిపారు. రఘునాథపాలెం మండలం మంచుకొండలో పలువురు రైతులు సాగు చేసిన పెసర పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పెసరను మారుక మచ్చల పురుగు ఆశిస్తుండడంతో పూత, పిందె రాలిపోతోందని తెలిపారు. దీని నివారణకు 1500 పీపీఎం వేప నూనె పిచికారీ చేయాలని, పురుగు ఉధృతంగా ఉంటే ప్లాత్రో, అంప్లిగో మందులను వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ కర్నాటి ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వద్దు

కామేపల్లి: నర్సరీల్లో మొక్కల సంరక్షణ, పెంపకంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ హెచ్చరించారు. మండలంలోని ముచ్చర్ల, కొత్తలింగాల, జాస్తిపల్లిలో బుధవారం పర్యటించిన ఆమె ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. అలాగే, నర్సరీలను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఎండ తీవ్రత కారణంగా మొక్కలు చనిపోకుండా సంరక్షించాలని సూచించారు. ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, నీడ కల్పించాలని తెలిపారు. ఎంపీడీఓ రవీందర్, ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణీ, ఈసీ వెంకటేశ్వర్లు, టీఏ భాస్కర్, ఫీల్డ్ అసిసెంట్లు పాల్గొన్నారు.

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రౌండ్ రిపోర్ట్

కన్నీరు ఇంకిపోతోంది..

జిల్లాలో నాగార్జునసాగర్ ఆయకట్టుతోపాటు నాన్ ఆయకట్టులోనూ బోర్లు, బావులు, చెరువుల కింద సాగు చేసిన వరి, మొక్క జొన్న, ఇతర పంటలు ఎండిపోతున్నాయి. యాసంగిలో అన్నీ కలిపి 2,93,991 ఎకరాల్లో పంటలు సాగు చేయగా ఇందులో వరి, మొక్కజొన్న అత్యధికంగా ఉన్నాయి. నాన్ ఆయకట్టులో బోర్లు, బావుల్లో నీళ్లు ఇంకిపోవడమే కాక చెరువుల్లో నీటి మట్టం తగ్గింది. అలాగే, వారబందీ విధానంతో సాగర్ చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. అటు కాల్వలు, బావులు, బోర్లలోనే కాక కళ్లలోనూ ఇంకిపోయిన నీటితో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. ఈమేరకు అన్నదాతల ఆవేదన, పంటల పరిస్థితిపై బుధవారం 'సాక్షి' చేపట్టిన పరిశీలనలో వెల్లడైన అంశాలతో కథనం...

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం / నెట్‌వర్క్

జిల్లాలో సాగునీటికి కటకట

- చివరి ఆయకట్టుకు అందని సాగర్ జలాలు
- వారబందీ విధానంతో రైతుల ఆందోళన
- బోర్లు, బావుల్లోనూ అడుగంటుతున్న భూగర్భ జలాలతో పంటల ఎండుముఖం



ఎల్లయ్య పొలానికి నీరు రావాల్సిన కాలువ

ఈ కుటుంబానికి దిక్కెవరు?

చింతకాని మండలం లచ్చగూడెంకు చెందిన నెర్సుల ఎల్లయ్య పదిహేనేళ్ల పాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేశాడు. ఇటీవల ఆరోగ్యం సహకరించక గ్రామంలోనే మూడెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. సాగర్ ఆయకట్టు చివరి భూమి కావడం, బావిలోనూ నీళ్లు అడుగంటడంతో నీరు అందించలేని పరిస్థితి ఎదురైంది. ఇప్పటికే రూ.60 వేలు పెట్టుబడి పెట్టిన ఆయన కళ్ల ముందే పంట ఎండిపోతుండడంతో మంగళవారం పొలం వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తమకు దిక్కెవరని రోదిస్తున్న ఆయన భార్య నర్సమ్మ, ఇద్దరు ఆడపిల్లలకు సమాధానం చెప్పేవారు కరువయ్యారు.



ఎల్లయ్య మృతితో రోదిస్తున్న భార్యాపిల్లలు



నీరు లేని మధిర మండలం నిదానపురం మేజర్ కాల్వ

చివరి ఆయకట్టు చింత

సాగర్ ఆయకట్టు 2.54 లక్షల ఎకరాలు కాగా.. కాల్వల ఆధారంగా లిఫ్ట్ ఇరిగేషన్లతో కలిపి 2.79 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఖమ్మం, వైరా, మధిర, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాలకు సాగర్ జలాలు సరఫరా అవుతుండడంతో వరి, మొక్కజొన్నతోపాటు ఆరుతడి పంటలను సాగు చేశారు. ఇందులో మొక్కజొన్న పంట కంకి దశలో ఉండగా నీటి తడులు ఎక్కువగా అవసరమవుతున్నాయి. కానీ సాగర్ జలాలను వారబందీ విధానంలో గత ఏడాది డిసెంబర్ 15 నుంచి విడుదల చేస్తున్నారు. మొదటి తడి 27 రోజులు ఇచ్చి తొమ్మిది రోజులు నిలిపేశారు. ఆపై రెండో తడి నుంచి తొమ్మిది రోజులు ఆన్, ఆరు రోజులు ఆఫ్ విధానం అమలవుతోంది. ఈ విధానంతో కొన్ని మండలాలకు నీరు అంది.. ఆపై నిలిచిపోవడంతో చివరి ఆయకట్టు రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో వారబందీ విధానం తొలగించి కనీసం రెండు నెలలపాటు సక్రమంగా సరఫరా చేయాలని ఇటీవల బోనకల్ మండల రైతులు కలెక్టర్‌ను కలిసి అభ్యర్థించారు.

అడుగంటిన భూగర్భ జలాలు

యాసంగిలో రైతులు సాగర్ జలాలతోపాటు బోర్లు, బావులను నమ్ముకోగా భూగర్భ జలాలు సైతం పడిపోయాయి. అధికారిక లెక్కల ప్రకారం గత ఏడాది డిసెంబర్‌లో భూగర్భ జలాలు 3.87 మీటర్ల లోతులో ఉంటే.. ఈ ఏడాది జనవరిలో 4.49 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఫిబ్రవరిలో ఎండలు పెరగగా నీటిమట్టం మరింత పడిపోయి బోర్లు, బావుల్లో కూడా నీళ్లు రోజురోజుకూ అడుగంటుతున్నాయి. బోరు బావుల్లో నీరు తగ్గగా పలువురు 5 హెచ్‌పీ మోటార్లు తీసేసి 3 హెచ్‌పీ మోటార్లను బిగించి వచ్చే అరకొర నీటిని పంటలకు పెడుతున్నారు.



తల్లాడ మైనర్ కాల్వ పరిధిలో నీరు అందక ఎండిపోతున్న వరి పైరు

కళ్ల ముందే ఎండుతున్న పంటలు

బోనకల్ మండలంలో ఎక్కువగా సాగర్ జలాలపైనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. బోనకల్ బ్రాంచ్ కెనాల్(బీబీసీ) పరిధి ఆళ్లపాడు, నారాయణపురం, కలకోట, రాపల్లి, గోవిందపురం, రాయన్నపేట తదితర గ్రామాల్లో ఆరు వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు కాగా వారబందీ విధానంతో చివరి భూములకు నీరందే పరిస్థితి లేదు. కొందరు రైతులు సమీపంలోని చెరువులు, వాగుల నుండి తాత్కాలికంగా నీటిని పెట్టుకుంటున్నారు. అలాంటి వసతి లేనివారు కళ్ల ముందే పంట ఎండిపోతున్నా కన్నీరు పెట్టుకునే పరిస్థితి నెలకొంది. బీబీసీ పరిధిలో 11 మైనర్ కాల్వలు ఉండగా, ఇక్కడి నుంచే ఏపీకి జలాలు వెళ్లాలి. కానీ చింతకాని మండలం, బోనకల్ మండలంలోని కొన్ని గ్రామాలకు నీరు చేరగానే నిలిచిపోతుండడంతో చివరి ఆయకట్టు ఎండిపోతోంది. ఇక తల్లాడ మండలంలోని సిరిపురం మేజర్ పరిధి తెలగవరం, తల్లాడ మైనర్ల కింద ఉన్న ఆయకట్టుకు నీరు అందడం లేదు. పుణ్యపురం మేజర్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. వైరా మండలం అష్టగుర్తిలో రాపల్లి మేజర్ కాల్వ పదో కి.మీ. పరిధిలో నీరు అందక మొక్కజొన్న పంట నిలువునా ఎండిపోతోంది.



బోనకల్ మండలం ఆళ్లపాడులో ఎండిపోతున్న మొక్కజొన్న

ఏపీ నుంచి నీటి కొనుగోలు

మధిర మండలం నిదానపురం మేజర్ కింద ఖమ్మంపాడుకు చెందిన గుమ్మా రవి ఐదెకరాల్లో మిర్చి సాగు చేశాడు. సాగర్ జలాలు అందుతాయని ఆశించి ఎకరాకు రూ.10వేల చొప్పున కౌలు చెల్లించాడు. రెండుసార్లు మాత్రమే సాగర్‌నీరు అందగా.. ఇప్పుడు తోట ఎండిపోతుండటంతో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం వి.అన్నవరంలోని లిఫ్ట్ నుంచి నీరు కొనుగోలు చేశాడు. ఒక్కో తడికి ఎకరాకు రూ.2వేలు చెల్లిస్తున్నానని రవి తెలిపాడు.

పంట చేతికందేలా లేదు..



కుక్కల ఫకీరు

ముదిగొండ మండలం గంధసిరికి చెందిన కుక్కల ఫకీరు ఆరెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. మున్నేరు సమీపంలో ఉన్నా బావిలో నీరు లేక ఇబ్బంది పడుతున్నాడు. కౌలు కింద 48 బస్తాలు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికే పెట్టుబడిగా రూ.1.20 లక్షలు వెచ్చించాడు. పరిస్థితి ఇలాగే ఉంటే పంట చేతికందడం కష్టమేనని చెబుతున్నాడు. ఎర్రుపాలెం మండలం మూమునూరులో కట్లేరుకు వచ్చే సాగర్ జలాలను నమ్ముకుని వరి, మొక్కజొన్న సాగు చేసినా నీళ్లు అందక పంటలు ఎండుతున్నాయి.

మిర్చికి అరకొరగానే..

కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన సామినేని వెంకటేశ్వర్లు ఐదెకరాల భూమిలో రెండు బోర్లు వేయించాడు. గతంలో మోటార్ల నుంచి 3 ఇంచుల మేర నీరు రావడంతో యాసంగిలో మిర్చి, పత్తి, మొక్కజొన్న వేశాడు. డిసెంబర్ నుంచి బోర్లలో నీరు తగ్గి కేవలం ఇంచు ధార మాత్రమే వస్తోంది. చేసేదేం లేక రెండున్నర ఎకరాల మొక్కజొన్న చొప్పను గొర్రెల మేతగా రూ.13 వేలకు విక్రయించాడు. పంటసాగుకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టిన ఆయన పరిస్థితి దయనీయంగా మారింది. ఇక బోర్లలో నీరు తగ్గగా 5హెచ్‌పీ మోటార్లు తీసేసి 3హెచ్‌పీ మోటార్లు బిగించి వస్తున్న అరకొర నీటిని మిరప పంటకు అందిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ధనియాకుల హన్మంతరావు రెండెకరాల్లో మిర్చి సాగు చేశాడు. బోరును నమ్ముకొని సాగు చేస్తే వారం రోజులుగా నీళ్లు ఇంకుతున్నాయి. దీంతో కొత్తగా మూడు బోర్లు వేయిస్తే చుక్కనీరు పడక పోగా రూ.లక్ష వరకు ఖర్చయింది.



ఎండిపోతున్న మిరప చేనులో వెంకటేశ్వర్లు

వరి వదిలి.. మామిడి సాగు..



కొమ్మినేని రాంబాబు

తల్లాడ మండలం అంజనాపురానికి చెందిన కొమ్మినేని రాంబాబు మూడేళ్లుగా వరి సాగు చేస్తున్నాడు. అయితే సాగర్ నీరందక నష్టం ఎదురవుతుండడంతో ఈసారి వరి మానేసి రెండెకరాల్లో మామిడి మొక్కలు నాటాడు. మామిడి దిగుబడి మూడేళ్లు దాటితే కానీ రాదు. దీంతో ఆదాయం కోల్పోతున్నా చేసేదేం లేదని చెబుతున్నాడు.

ఏ ఒక్కరూ వడదెబ్బ బారిన పడొద్దు

- జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన
- ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాల ఏర్పాటు
- టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వడదెబ్బపై అవగాహనకు రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: నానాటికీ ఎండలు పెరుగుతుండడం, వడగాలులు మొదలయ్యే అవకాశమున్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి టాస్క్ ఫోర్స్ కమిటీతో సమావేశమయ్యారు. గత ఏడాది జిల్లాలో 45 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదైనందున, ఈసారీ అదే పరిస్థితి ఉండొచ్చని చెప్పారు. ఈమేరకు ఎండలో పనిచేసే నిర్మాణ కార్మికులు, కూలీలు, పారిశుద్ధ్య కార్మికుల వివరాలు సేకరించాలని, గత అనుభవాల దృష్ట్యా వ్యవసాయ మార్కెట్లలో టెంట్లు, తాగునీరు సమకూర్చడమే కాక ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అంతేకాక అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించే ప్రభుత్వ శాఖల సిబ్బంది కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం అవగాహన కల్పించేలా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అదనపు డీసీపీ నరేష్‌కుమార్, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, డీపీఓ ఆశాలత, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి, ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ, వివిధ శాఖల ఉద్యోగులు నర్సింహారావు, ఎల్.రాజేందర్, నూరుద్దీన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

ఖమ్మం సహకారనగర్: పిల్లల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో తప్పనిసరిగా బాలల సంరక్షణ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, పిల్లలపై జరిగే మానసిక, శారీరక దాడుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇక ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులపై వేధింపులు నివారణ కోసం అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయంచాలని చెప్పారు.

చివరి ఆయకట్టుకూ సాగునీరు

జిల్లాలో చిట్టచివరి ఆయకట్టుకు సైతం సాగునీరు అందేలా కార్యాచరణ అమలుచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. సాగునీటి సరఫరాపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్షించిన ఆయన నీటిపారుదల, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ సమస్యలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి పరిష్కరించాలన్నారు. డీఆర్వో పద్మశ్రీ, జలవనరుల శాఖ ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు, డీఏఓ పుల్లయ్య, ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్ పాల్గొన్నారు.

చెల్లెమ్మా.. టీ బాగుంది!

ఖమ్మంరూరల్: అద్భుతమైన రుచితో టీ చేశారు.. చాలా బాగుంది చెల్లెమ్మా అంటూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ స్త్రీ టీ క్యాంటీన్ నిర్వాహకురాలిని అభినందించారు. కలెక్టర్ చొరవతో ఇందిరా మహిళా శక్తి ద్వారా మంజూరైన రుణాలతో జిల్లాలో 22 స్త్రీ టీ క్యాంటీన్లు ఏర్పాటయ్యాయి. ఈమేరకు ఖమ్మం రూరల్ మండల పర్యటనకు వెళ్లిన కలెక్టర్ తరుణి హాట్ ఎదుట ఏర్పాటుచేసిన క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈసమయంలో నిర్వాహకురాలు శ్రీరంగం గీత టీ అందించగా రుచి చూసిన కలెక్టర్ బాగుందని ప్రశంసించారు. నాణ్యత పాటిస్తూ ప్రజల్లో నమ్మకం చూరగొనడం ద్వారా వ్యాపారం విస్తరించుకోవాలని సూచించారు. తద్వారా ఖమ్మం బ్రాండ్‌కు పేరు తీసుకురావాలని ఆయన తెలిపారు. ఇందుకు యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా కల్పించారు. అనంతరం ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి సూచనలు చేశారు. తహసీల్దార్ పి.రాంప్రసాద్, గృహనిర్మాణ శాఖ ఈఈ శ్రీనివాసరావు, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్యాంటీన్ నిర్వాహకురాలు గీతతో మాట్లాడుతున్న కలెక్టర్

మెప్మాలో అడుగడుగునా నిర్లక్ష్యం

- బకాయిలపై సభ్యులకు బ్యాంకర్ల నుండి నోటీసులు
- ఆర్పీ పక్కదారి పట్టించడమే కారణం

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తోంది. పట్టణాల్లో సంఘాల సభ్యులకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యాన ఈ రుణాలు మంజూరు చేయిస్తుంటారు. ఇదంతా టీఎల్‌ఎఫ్, సీఓ, ఆర్పీల పర్యవేక్షణలో కొనసాగుతుండగా కొందరు ఆర్పీలు సభ్యుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నగదు స్వాహా చేస్తున్నారు. ఈక్రమంలోనే ఖమ్మం ప్రకాశ్‌నగర్‌కు చెందిన ఓ ఆర్పీ.. సభ్యులకు మంజూరైన రుణాన్ని తీసుకుని తిరిగి కట్టకపోవడంతో సభ్యులకు బ్యాంకు నుంచి నోటీసులు అందాయి.

వరుస నోటీసులతో...

ప్రకాశ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఆరు మహిళా సంఘాలకు 2021–22 ఏడాదిలో రూ.2 కోట్లకు పైగా రుణాలను బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ద్వారా ఆర్పీ మంజూరు చేయించారు. ఈ సమయాన ఒక సీఓ సంతకం చేసినా మరొకరి సంతకాన్ని ఆర్పీ ఫోర్జరీ చేసినట్లు సమాచారం అంతేకాక 40 మంది సభ్యుల ఖాతాల్లో జమ అయిన కొంత మొత్తాన్ని ఆమె తీసుకున్నట్లు సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇక సభ్యులు తాము రుణాలు సకాలంలో చెల్లించినా, ఆర్పీ నగదు తిరిగి కట్టకపోవడంతో బ్యాంకర్లు నోటీసులు జారీ చేస్తున్నారు. తాజాగా బ్యాంకర్లు ఆర్పీ ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉండడం గమనార్హం. సుమారు రూ.1.50 కోట్ల మేర ఆర్పీ తీసుకున్నట్లు తెలుస్తుండగా, నోటీసులకు స్పందించని కారణంగా సభ్యులతో పాటు ఆర్పీ ఖాతాను ఇప్పటికే బ్లాక్ చేసినట్లు తెలిసింది.

'వన్ టైం' కోసం..

ఖమ్మం పరిధిలోని మెప్మా ద్వారా మంజూరు చేయించే రుణాల చెల్లింపులో ఆర్పీలు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఎప్పటి నుంచో విమర్శలు ఉన్నాయి. సభ్యులకు మంజూరయ్యే రుణాలు ఆర్పీలు తీసుకుని తామే చెల్లిస్తామని నమ్మబలకడం, ఆ తర్వాత సకాలంలో చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. ఈక్రమంలోనే ఖాతాలను బ్లాక్‌లో పెడుతున్న బ్యాంకర్లు కొన్నాళ్లకు వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అవకాశం ఇస్తున్నారు. దీంతో ఎంతోకొంత చెల్లించి ఆర్పీలు సెటిల్ చేస్తున్నారని సమాచారం. ఇదేమాదిరి ప్రకాశ్‌నగర్ ప్రాంత ఆర్పీ కూడా వ్యవహరించగా, ఇందులో సీఓల పాత్ర కూడా ఉందని తెలిసింది. ఈఅంశంపై మెప్మా అధికారులను వివరణ కోరగా.. బ్యాంకర్లు రుణాలను సభ్యుల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. అప్పుడు ఒక సీఓ సంతకాన్ని ఆర్పీ ఫోర్జరీ చేసినట్లు తేలగా ఆమెను విధుల నుంచి తొలగించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

మిల్లులు, స్కూళ్లలో డీఎస్‌ఓ తనిఖీ

ఖమ్మంరూరల్: మండలంలోని పలు రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. జలగంనగర్‌తో పాటు ఇంకొన్ని ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన బియ్యం, కూరగాయలు, గుడ్లు అందించాలని తెలిపారు. ఆతర్వాత వరంగల్ క్రాస్‌లోని రైస్ మిల్లును తనిఖీ చేసిన ఆయన గడువులోగా సీఎంఆర్ అందించాలని ఆదేశించారు. తనిఖీల్లో సివిల్ సప్లయీస్ డీటీ విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సేవలపై ఆరా

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిని మెడికల్ అండ్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్, టాస్క్‌ఫోర్స్ టీమ్ లీడర్ కె.శశిశ్రీ, అసోసియేటెడ్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ద్వారా ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, ప్రసవాల సంఖ్య, అందుబాటులో ఉన్న మందులు, వ్యాక్సిన్లపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందిస్తూనే నిర్దేశిత లక్ష్యాలను నూరు శాతం సాధించాలని, అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.సీతారామ్, డీపీఓ దుర్గ, వైద్యాధికారులు, ఉద్యోగులు రమేష్, నవ్యకాంత్, మౌనికాశ్మృతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురం, ఖమ్మం, టేకులపల్లిలో పలు కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు. ఆతర్వాత ఖమ్మం క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలను కలవనున్న మంత్రి.. భద్రాద్రి జిల్లా త్రీ ఇంక్లైన్, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, గాంధీనగర్, వైరాలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

రాష్ట్ర ఉషా టోర్నీలో పతకం



పతకం అందుకుంటున్న పవిత్రాచారి

ఖమ్మం స్పోర్ట్స్: ఆదిలాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఉషా టోర్నీలో జిల్లాకు చెందిన పి.పవిత్రాచారి సీనియర్స్ విభాగంలో ప్రథమస్థానం దక్కించుకుంది. ఈమేరకు ఆమె బంగారు పతకం గెలవడమే కాక త్వరలో జరగనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీలకు అర్హత సాధించింది. ఆమెను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి అభినందించారు.

ఆర్టీసీ సమ్మె నాటి కేసు కొట్టివేత

ఖమ్మం లీగల్: ఆర్టీసీ కార్మికుల సమ్మె సందర్భంగా 2020 ఏడాదిలో నమోదైన ఓ కేసును కొట్టేస్తూ ఖమ్మం ఒకటో అదనపు ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ బిక్కం రజని బుధవారం తీర్పు నిచ్చారు. ఆర్టీసీలో సమ్మె 55రోజుల పాటు సాగగా, మహిళా కండక్టర్ నీరజ ఖమ్మంలోని తన నివాసంలో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఆమె మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలపై కేసు నమోదు చేయగా విచారణ అనంతరం కొట్టివేశారు. కాగా, వివిధ పార్టీల నాయకులు బాగం హేమంతరావు, పోతినేని సుదర్శన్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మంద వెంకటేశ్వర్లు, చోటా బాబా, తాజుద్దీన్ తదితరులపై అప్పట్లో కేసు నమోదు కాగా, కేసును న్యాయవాదులు ఓరుగంటి శేషగిరిరావు, ఏడునూతల శ్రీనివాసరావు వాదించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కల్లూరురూరల్: మండలంలోని బత్తులపల్లి శివారులో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పెనుబల్లి మండలం బ్రహ్మళ్లకుంట, బత్తులపల్లికి చెందిన ఇద్దరు పట్టుబడగా మరికొందరు పారిపోయారు. పట్టుబడిన వారి నుంచి రూ.6,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిత తెలిపారు.

కోడిపందెం రాయుళ్లు...

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్లలో శ్మశానవాటిక సమీపాన కొద్ది రోజులుగా కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 12 మందిని అరెస్టు చేయగా, ఇంకో ఇద్దరు పరారయ్యారని ఎస్‌ఐ పి.వెంకటేష్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారి నుంచి రూ.7వేల నగదు, ఆరు బైక్‌లు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

ప్రేమించి పెళ్లికి నిరాకరించిన యువకుడిపై కేసు

కారేపల్లి: ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆ తర్వాత ముఖం చాటేసిన యువకుడిపై కారేపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండలంలోని భాగ్యనగర్ తండాకు చెందిన కిరణ్‌సాయి ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో రెండేళ్లుగా ప్రేమలో ఉన్నారు. ఇటీవల ఆమె పెళ్లి చేసుకోవాలని అడగగా నిరాకరించాడు. అంతేకాక పలువురి స్నేహితులతో కలిసి ఆమె ఇంటికి వెళ్లి గొడవ చేశాడు. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో కిరణ్‌సాయి, ఆయన స్నేహితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.రాజారాం తెలిపారు.

ఆర్మీ జవాన్ అదృశ్యంపై ఫిర్యాదు



పాటి రాజేష్

ఖమ్మంక్రైం: ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఖమ్మం సంభానీనగర్‌కు చెందిన పాటి రాజేష్(37) ఆర్మీలో జవాన్‌గా పనిచేయగా ఏడాది క్రితం అనారోగ్యానికి గురవడమే కాక మతిస్థిమితం తప్పడంతో ఇంటికి వచ్చేశాడు. గత ఏడాది ఆగస్టు నెల 24న ఇంటి నుంచి వెళ్లిన ఆయన ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియరాలేదు. రాజేష్ ఇంటి నుంచి వెళ్లే సమయాన 63785 22492 నంబర్‌తో కూడిన ఫోన్ ఉందని కుటుంబీకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు వివరాలు తెలిసిన వారు 87125 75779 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ మౌలానా సూచించారు.

బియ్యం ఇస్తారా, ఇవ్వరా?

- ఇంకా పలువురికి అందని రేషన్ బియ్యం
- 'పోర్టబులిటీ'తో డీలర్ల వద్ద కొరత
- నేటితో ముగియనున్న పంపిణీ గడువు



ఖమ్మం సహకారనగర్/ఖమ్మం అర్బన్: రేషన్‌కార్డు ఏ ప్రాంతంలో ఉన్నప్పటికీ నివసించే చోట బియ్యం తీసుకునేలా కొన్నాళ్ల నుంచి 'వన్ నేషన్.. వన్ రేషన్' పేరిట పోర్టబులిటీ విధానం అమలవుతోంది. లబ్ధిదారులు నష్టపోవద్దని ఈ విధానాన్ని ప్రవేశపెట్టగా జిల్లా కేంద్రంలోని రేషన్ షాపుల్లో త్వరగా బియ్యం నిల్వలు కరిగిపోతున్నాయి. దీంతో స్థానిక లబ్ధిదారులకు బియ్యం అందక షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఇలా ప్రతీనెలా జరుగుతున్నా డిమాండ్ ఉన్న షాపులకు అదనంగా బియ్యం కేటాయించాల్సిన అధికారుల నిర్లక్ష్యంతో సమస్య తీవ్రరూపం దాలుస్తోంది.

జిల్లా కేంద్రంలోనే సమస్య

జిల్లాలో 748 రేషన్ షాపులు ఉండగా, వీటి పరిధిలో 4,11,566 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇక 11,29,030మంది లబ్ధిదారులు ఉండగా ప్రతినెల సుమారు 6వేల మెట్రిక్ బియ్యం అవసరమవుతుంది. అయితే, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల వారు నివసిస్తుండగా పోర్టబులిటీ విధానంలో నెల తొలినాళ్లలోనే బియ్యం తీసుకుంటున్నారు. దీంతో స్థానికులు వచ్చేసరికి షాపుల్లో బియ్యం నిల్వలు నిండుకుంటున్నాయి. ఖమ్మం నగరంలో 94 రేషన్ దుకాణాలకు గాను సుమారు 80షాపుల్లో పోర్టబులిటీ ద్వారా బియ్యం తీసుకెళ్తున్నారని అంచనా. తద్వారా ఆయా షాపుల పరిధి లబ్ధిదారులకు నెలనెలా కేటాయించే బియ్యానికి తోడు డీలర్లకు సుమారు 50క్వింటాళ్ల బియ్యం అదనంగా అవసరమవుతున్నట్లు తెలుస్తోంది.

అప్రూవ్ అయినా...

అదనంగా బియ్యం అవసరమైన డీలర్లు 7, 8వ తేదీకల్లా జిల్లా పౌరసరఫరాల అధికారి(డీఎస్‌ఓ)కి వినతి ఇవ్వగానే అధికారి అప్రూవ్ చేస్తే గోదాం నుంచి విడుదల చేస్తారు. కానీ గత రెండు నెలలుగా డీలర్లకు సకాలంలో బియ్యం అందక ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈనెల 19వ తేదీ నాటికి కూడా అధికారి అప్రూవ్ చేసినా డీలర్లకు బియ్యం అందకపోవడం గమనార్హం. జిల్లాలోని గోదాంల్లో నిల్వలు లేక ఈ పరిస్థితి నెలకొందని సమాచారం. ఈనెలారంభం నుంచే బియ్యం అరకొరగా సరఫరా అవుతుండడంతో 20వ తేదీ వరకు తీసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. కానీ జిల్లాలోని షాపులకు ఇంకా 350 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా కావాల్సి ఉండడం, 20వ తేదీ గురువారంతో సరఫరా గడువు ముగియనుండడంతో సందిగ్ధత నెలకొంది. అయితే, గతంలోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు గడువు మరిన్ని రోజులు పెంచినందున ఈసారీ పొడిగించే అవకాశముందని తెలుస్తోంది.

రెండు, మూడు రోజుల్లో సరఫరా చేస్తాం



జిల్లాకు సుమారు 350మెట్రిక్ టన్నుల మేర అదనంగా బియ్యం అవసరముంది. నల్లగొండ జిల్లా నుంచి బియ్యం తెప్పించేందుకు అక్కడి అధికారులతో మాట్లాడాం. రెండు, మూడు రోజుల్లో రేషన్ దుకాణాలకు అందించి లబ్ధిదారులకు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం.

– జి.శ్రీలత, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

ఏకగ్రీవంగా హెచ్‌డబ్ల్యూఓల కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ వసతిగృహ సంక్షేమ అధికారుల(హెచ్‌డబ్ల్యూఓ) సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఖమ్మంలోని టీఎన్జీవోస్ భవన్‌లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్, హెచ్‌బ్ల్యూఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డీ.గౌస్ హష్మీ ఆధ్వర్యాన బుధవారం ఎన్నికలు నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడిగా కోటపాటి రుక్మారావు, కార్యదర్శిగా నెల్లూరి నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులుగా బజ్జూరి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కంభం తిరుపతిరావును ప్రకటించారు. అలాగే, ఉపాధ్యక్షులుగా కె.వీరభద్రరావు, ఎస్.వెంకట్‌రెడ్డి, ఎం.కోమలితో పాటు వివిధ పదవులకు కె.వెంకటేశ్వరరావు, ఆర్.నాగరాజు, పి.మాధురి, సీహెచ్.నాగమణి, జి.వినోద, ఐ.జ్యోత్స్న, టి.స్టాలిన్, జి.వెంకటేశ్వర్లు, ఎం.వెంకటకృష్ణ, పి.కృష్ణకిరణ్, జె.నర్సింహారావు ఎన్నికయ్యారని వెల్లడించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గౌస్ హష్మి మాట్లాడుతూ హాస్టళ్లకు బిల్లులు, ఇతర సమస్యలను టీఎన్జీవోస్ సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈసమావేశంలో కె.దుర్గాప్రసాద్, తాళ్లూరి శ్రీకాంత్, వై.రమేష్, కరణ్ సింగ్, బి.చంద్రశేఖర్, రాధాకృష్ణ, శ్రీధర్ సింగ్, వై.శ్రీనివాసరావు, అస్లాం, ఎస్.విజయ, ఎం.వీరన్న, కృష్ణ, మాధవ్‌గౌడ్, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాల్సిందే..



రైతుల సమస్యలు వింటున్న ఆర్డీఓ నర్సింహారావు, అధికారులు

చింతకాని: నాగపూర్ – అమరావతి జాతీయ రహదారి నిర్మాణంతో భూమి కోల్పోతున్న తమకు ఎకరాకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని కొదుమూరులో భూ నిర్వాసిత రైతులతో ఆర్డీఓ నర్సింహారావు బుధవారం సమావేశమయ్యారు. అయితే, ఎకరాకు రూ.25 లక్షలే జమ చేశారని, మార్కెట్ ధర ప్రకారం రూ.50 లక్షలు చెల్లించడంతోపాటు పొలాలకు వెళ్లేందుకు అండర్ పాస్, సర్వీస్ రోడ్డు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, వ్యవసాయ బావులు, దీర్ఘకాలిక పంటలకు సైతం పరిహారాన్ని అందించాలన్నారు. అప్పటివరకు రహదారి నిర్మాణ పనులు చేయనిచ్చేది లేదని రైతులు స్పష్టం చేయగా, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీఓ తెలిపారు. తహసీల్దార్ కూరపాటి అనంతరాజుతో పాటు వివిధ సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాలన మరింత పారదర్శకంగా..

- కేఎంసీ ఉద్యోగుల సమయపాలనపై దృష్టి
- అధికారులు, ఉద్యోగులకు గుర్తింపు కార్డులు కూడా..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ(కేఎంసీ) కార్యాలయంలో పరిపాలన మరింత పారదర్శకంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన, సత్వర సేవలు అందించడంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటించేలా పర్యవేక్షించడాన్ని ప్రథమ ప్రాధాన్యత తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఫిర్యాదులు, వినతులు ఇచ్చేందుకు ప్రజలు వస్తుండగా, ఇంకొందరు ప్రైవేట్ వ్యక్తులు కూడా ఇష్టారాజ్యంగా వచ్చివెళ్తుండడంతో ప్రత్యేక సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని భావిస్తున్నట్లు సమాచారం.

ఎప్పుడొస్తున్నారు ?

కేఎంసీ కార్యాలయంలో రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, ఎస్టాబ్లిస్‌మెంట్, అకౌంట్స్, శానిటేషన్ తదితర విభాగాలకు సంబంధించి రెగ్యులర్ ఉద్యోగులు 250 మంది వరకు ఉండగా.. వీరిలో 120 మంది వరకు కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక ఔట్ సోర్సింగ్ విధానంలో పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బంది 1,100 మందికి గాను 100 మంది వరకు కార్యాలయంలో పనిచేస్తున్నారు. అయితే, ఇందులో ఎవరెవరు, ఎప్పుడెప్పుడు వస్తున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కార్యాలయంలో విధులు నిర్వర్తించే అందరికీ గుర్తింపు కార్డులు జారీ చేసి, ఆన్‌లైన్‌లో హాజరు నమోదుకు కమిషనర్ నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే సెల్‌ఫోన్ సాయంతో లొకేషన్ ఆధారంగా హాజరు నమోదుకు ఏర్పాట్లు మొదలైనట్లు సమాచారం.

భోజనం ఇక్కడే..

కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులంతా కేఎంసీలోనే భోజనం చేయాలని కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. భోజనం పేరిట పలువురు బయటకు గంటల తరబడి సమయం వృథా చేస్తున్నట్లు తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈమేరకు మధ్యాహ్నం 1–30 నుండి 2గంటల వరకు విరామ సమయంలో కార్యాలయ మూడో అంతస్తులోని డైనింగ్ హాల్‌లో భోజనం చేయాలని సూచించారు. ఇక కార్యాలయానికి ఎవరెవరు, ఏయే పనులపై వస్తున్నారో నమోదుకు కొత్తగా రిసెప్షన్ కౌంటర్ ఏర్పాటు చేయనున్నారు. కార్యాలయ ప్రవేశం వద్దే ఈ కౌంటర్ ఏర్పాటుచేసి ఉద్యోగిని నియమిస్తారు. తద్వారా ఎవరు, ఏ పనిపై వచ్చారో నమోదు చేసుకుని స్లిప్ జారీ చేసి ఆ విభాగంలోకే వెళ్లేలా పర్యవేక్షిస్తారు.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్తాం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లి: మండలంలోని సింగరేణికి చెందిన కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ ద్వారా వస్తున్న దుమ్ముధూళితో స్థానికులు పడుతున్న ఇబ్బందులను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్తామని బీజేపీ నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, ఈ.వీ.రమేష్ తెలిపారు. ప్లాంట్ నుంచి వెలువడే కాలుష్యంతో అనారోగ్యం బారిన పడుతున్నామని కిష్టారం అంబేద్కర్‌నగర్ వాసులు చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని బుధవారం వారు సందర్శించారు. అక్కడి నుంచే సింగరేణి సీఎండి బలరాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డితో మాట్లాడి సమస్యను వివరించారు. సీహెచ్‌పీ ద్వారా వచ్చే దుమ్ముధూళితో కిష్టారం, లంకపల్లి, జలగంనగర్, రేజర్ల, ఎన్టీఆర్‌నగర్, వెంగళరావునగర్, చౌడవరం వాసులు ఇబ్బంది పడుతున్నందున సింగరేణి అధికారులు స్పందించాలన్నారు. కాగా, సింగరేణి సీఎండీ బలరాం స్పందించి ప్రత్యేక కమిటీ ద్వారా పరిశీలిస్తామని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, మట్టా ప్రసాద్, పాలకొల్లు శ్రీనివాస్, విజయ్, వసంతరావు, రెహమతుల్లా, శేషగిరి, శివ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీ



క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ గ్రీష్మ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ స్మారక జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ కొనసాగుతుంది. ఈమేరకు బుధవారం కొత్తగూడెం రూరల్ – కిన్నెరసాని పాల్వంచ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కొత్తగూడెం రూరల్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కిన్నెరసాని పాల్వంచ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. జట్టులో భైరవ్‌సర్కార్ 20 బంతుల్లో 35 పరుగులు చేశాడు. ఆతర్వాత బ్యాటింగ్‌కు దిగిన కొత్తగూడెం రూరల్ జట్టు 14 ఓవర్లలోనే 133 పరుగుల చేయగా విజయం సాధించింది. ఈ జట్టులో అశోక్ నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 5 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తొలుత మ్యాచ్‌ను డాక్టర్ గ్రీష్మ ప్రారంభించారు. టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్‌తో పాటు రాజేష్, భరత్, లింగేష్, రాజారమేష్ పాల్గొన్నారు.

కత్తెర పురుగు నిర్మూలనపై అవగాహన



మొక్కజొన్న చేనులో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తల్లాడ: మండలంలోని గోపాలపేటలో పలువురు రైతుల మొక్కజొన్న క్షేత్రాలను తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ మొక్కజొన్న పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్ర వేత్త డి.భద్రునాయక్, సీనియర్ శాస్త్ర వేత్త బి.మల్లయ్య బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా పంటను ఆశిస్తున్న కత్తెర పురుగులు, రెక్కల పురుగులను గుర్తించడంతో పాటు సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. లేత మొక్కజొన్నలో ఎకరానికి(30 రోజుల వరకు) 10 – 15 లింగార్షక బుట్టలను అమర్చుకోవాలని, వేప సంబంధిత మందు అజాడి రక్తిన్ (1500 పీపీఎం) 5 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ ఎం.డీ.తాజుద్దీన్, ఏఈఓ హసీనాబేగం, రైతులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే మెరుగైన ఫలితం



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న డీఈఓ శర్మ

పెనుబల్లి: విద్యార్థులు కష్టపడి చదివితే మెరుగైన ఫలితాలు వస్తాయని, తద్వారా ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. మండలంలోని టేకులపల్లి మోడల్ స్కూల్‌ను బుధవారం తనిఖీ చేసిన ఆయన విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు వేసి సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ పదో తరగతిలో మంచి మార్కులు సాధించడం ద్వారా తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపాల్ బి.రూపస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.11.58 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



నిందితుడు, గంజాయితో సీఐ, తదితరులు

ఖమ్మంక్రైం: ఖమ్మంలో రైల్వేస్టేషన్ నుంచి ముంబై తరలించడానికి సిద్ధంగా ఉన్న గంజాయిని జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జీఆర్పీ సీఐ అంజలి, డోర్నకల్ ఎస్‌ఐ సురేష్ మంగళవారం సాయంత్రం ఖమ్మం స్టేషన్‌లో తనిఖీ చేస్తుండగా రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై రెండు సూట్‌కేసులతో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో ఆయన వద్ద సోదా చేయగా రూ.11.58లక్షల విలువైన 46కేజీల గంజాయి లభ్యమైంది. మహారాష్ట్రలోని పర్బనీ జిల్లాకు కార్మికుడైన ఆయన తేలికగా డబ్బు సంపాదించడానికి ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ముంబైలో అమ్మడానికి వెళ్తున్నట్లుగా తేలింది. ఈమేరకు నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అంజలి తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

సిబ్బంది లేక అంబులెన్స్‌లోనే 20 నిమిషాలు



సత్తుపల్లి ఆస్పత్రి వద్ద అంబులెన్స్‌లో క్షతగాత్రులు

సత్తుపల్లిరూరల్/దమ్మపేట: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో బుధవారం జరిగింది. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సత్తుపల్లి మండలం చిన్నపాకలగూడేనికి చెందిన కేతేపల్లి జానకీరాం బైక్‌పై పట్వారిగూడెం వైపు నుంచి సత్తుపల్లి వైపు వస్తుండగా.. దమ్మపేట మండలం జగ్గారానికి చెందిన మడివి నాగేంద్రబాబు, వగ్గెల లక్ష్మణ్ మరో ద్విచక్రవాహనంపై జగ్గారం వెళ్తున్నారు. మార్గమధ్యలోని గండుగులపల్లిలో వీరి వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా లక్ష్మణ్, జానకీరాం, నాగేంద్రబాబుకు తీవ్రగాయాలు కావడంతో 108లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అయితే, జానకీరాం, లక్ష్మణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. కాగా, క్షతగాత్రులను 108లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చిన సమయాన సిబ్బంది ఒక్కరే ఉండడంతో వారిని లోపలకు తీసుకెళ్లేందుకు 20 నిమిషాలకు పైగా సమయం పట్టింది. అంతసేపు క్షతగాత్రులు అవస్థ పడ్డారు.

చెల్లని చెక్కు కేసులో మూడు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో ఖమ్మం బీ.కే.బజార్‌కు చెందిన బిజ్జాల భాస్కర్‌కు మూడు నెలలు జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప బుధవారం తీర్పు చెప్పారు. బీ.కే.బజార్‌కు చెందిన ఉల్లి శ్రీనివాసరావు వద్ద భాస్కర్ 2015 సెప్టెంబర్ 30న రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. ఆతర్వాత అప్పు చెల్లించే క్రమంలో 2018 ఫిబ్రవరి 28న రూ.లక్షకు చెక్కు జారీ చేయగా ఆ చెక్కును ఖాతాలో జమ చేస్తే సరిపడా నగదు లేక గురైంది. దీంతో శ్రీనివాసరావు తన న్యాయవాది ద్వారా నోటీస్ జారీచేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. కేసును విచారించాక భాస్కర్‌పై నేరం రుజువు కావడంతో మూడు నెలల జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.1.20 లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



రామకృష్ణ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: రోడ్డుపక్కగా నడిచి వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై మృతి చెందాడు. మండలంలోని కాకర్లపల్లికి చెందిన నాగళ్ల రామకృష్ణ(38) బుధవారం గ్రామశివారులో నడిచి వెళ్తుండగా వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. కాగా, మోపెడ్ నడుపుతున్న ఇండ్ల వెంకటేశ్వరరావు సైతం గాయపడగా సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

కుక్కల దాడిలో గేదె ...

నేలకొండపల్లి: ఓ గేదెను వేటాడిన కుక్కలు తీవ్రంగా గాయపర్చడంతో మృతి చెందింది. నేలకొండపల్లికి చెందిన రైతు డి.ఉపేందర్ బుధవారం పాడి గేదెను మేతకు వదిలాడు. ఒక్కసారిగా అక్కడకు వచ్చిన 20కి పైగా కుక్కలు దాడి చేయడంతో గేదె పరుగులు తీసింది. అయినా కుక్కల గుంపు వెంటాడి దాడి చేయగా తీవ్రగాయాలతో మృతి చెందింది. కళ్ల ముందే రూ.70వేల విలువైన గేదె మృతి చెందడంతో రైతు కన్నీరు మున్నీరయ్యాడు. కాగా, ఉపేందర్‌కు చెందిన నాలుగు నెలల దూడపై వారం క్రితం కుక్కలు దాడి చేసి చంపేశాయి. ఇకనైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నజీరుద్దీన్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సత్తుపల్లి మండలం గంగారానికి చెందిన ఆటోడ్రైవర్ ఎస్.కే.నజీరుద్దీన్(43) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు నెలల క్రితం ఒక కిడ్నీ తొలగించగా మరో కిడ్నీకి కూడా సమస్య ఉందని చెప్పడంతో మనస్తాపానికి గురైన ఆయన బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆత్మహత్య చేసుకున్నాడు. నజీరుద్దీన్‌కు భార్య జీనత్ ఉన్నారు.

క్షణికావేశంలో మరొకరు..

కారేపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి ఇంట్లో గొడవ పడి క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని పేరుపల్లికి చెందిన పద్దం మాధవరావు (53) రైల్వే కాంట్రాక్టు కూలీ పనులు చేస్తుంటాడు. ఇటీవల మద్యానికి బానిసైన ఆయన బుధవారం కూడా మద్యం తాగి రావడంతో భార్య నాగమణితో గొడవ జరిగింది. దీంతో భార్య ఇంటి నుంచి బయటికి వెళ్లిపోగా ఆయన చీరతో ఉరి వేసుకున్నాడు. కాసేపటికి వచ్చిన నాగమణి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి మాధవరావు మృతి చెందాడు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

22న బియ్యం వేలం

ఖమ్మం సహకారనగర్: వివిధ కేసుల్లో జప్తు చేసిన 771.969మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, ఏన్కూరు, వైరా, మధిర, నేలకొండపల్లి, సత్తుపల్లి, కల్లూరు గోడౌన్లలో నిల్వ చేయగా, వేలం ద్వారా విక్రయించనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. ఈనెల 22న ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయం వద్ద వేలం ఉంటుందని పేర్కొన్నారు. జీఎస్టీ లైసెన్స్‌దారులు, డిస్టిలరీలు, బేవరేజెస్ కంపెనీల బాధ్యులు మాత్రమే అర్హులని, ఆసక్తి ఉన్న వారు వారు రూ.50వేల రూపాయల డీడీతో హాజరుకావాలని సూచించారు.